ఇందిరమ్మ ఇళ్ల సర్వే తప్పుల తడక

- గతంలోనే ఇల్లు మంజూరైనట్లు దరఖాస్తుల తిరస్కరణ
- మొదటికి వచ్చిన ఇందిరమ్మ సర్వే

హుస్నాబాద్‌రూరల్: ఇందిరమ్మ ఇళ్ల సర్వే తప్పుల తడకగా సాగింది. పేదలకు సొంత ఇల్లు కట్టించాలని ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఒక్కొక్కరికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మొదట ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా లబ్ధిదారులను ఎంపిక చేయడానికి గ్రామాల్లో అధికారులు సర్వే చేపట్టారు. నాలుగు పథకాల్లో ఏ ఒక సర్వేను కూడా అధికారులు పూర్తి స్థాయిలో చేయలేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల జాబితాలు మొత్తం తప్పుల తడకగా ఉన్నాయని ఫిర్యాదు రావడంతో మళ్లీ సర్వే చేయాలని పంచాయతీ కార్యదర్శులను అధికారులు ఆదేశించడం విశేషం.

హుస్నాబాద్ మండలంలో 17 గ్రామ పంచాయతీలు ఉండగా.. అయా గ్రామాల నుంచి ప్రజా పాలనలో 5,605 మంది ఇళ్లు కావాలని దరఖాస్తులు చేసుకున్నారు. దరఖాస్తులు ఎక్కువ సంఖ్యలో రావడంతో మొదట మండలానికి ఒక గ్రామం ఎంపిక చేసి వందశాతం పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో తోటపల్లి గ్రామాన్ని ఎంపిక చేశారు. ఇక్కడ 257 మంది ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకొంటే 134 మందిని అర్హులుగా గుర్తించారు. జనవరి 26న వీరికి అధికారులు మంజూరు పత్రాలు అందించారు. ఇంకా 123 మంది దరఖాస్తులు ఎందుకు తిరస్కరించారో చెప్పాలని డిమాండ్ చేయగా.. ఇందులో కొందరికి ట్రాక్టర్ ఉందని, మరి కొందరు గతంలో ఇందిరమ్మ ఇల్లు పొందారని రకరకాల సాకులు చూపించి దరఖాస్తులను రిజెక్ట్ చేసినట్లు చెప్పలేక మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. మండలంలో 5,605 మంది దరఖాస్తులకు సగం వరకు తిరస్కరించినట్లు విశ్వసనీయ సమాచారం.



మీర్జాపూర్‌లో సర్వే చేస్తున్న అధికారులు (ఫైల్)

అర్హుల జాబితాను తగ్గిస్తుండ్రు

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన 2014 నుంచి పదేళ్లు రాష్ట్రంలో ఇందిరమ్మ పథకమే లేదు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత హౌసింగ్ కార్పొరేషన్‌ను రద్దు చేసి గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పథకాన్ని ప్రవేశపెట్టింది. ప్రస్తుతం ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకొంటే ఇదివరకే ఇందిరమ్మ ఇల్లు వచ్చినట్లు అధికారులు దరఖాస్తులను తిరస్కరించడం ఏమిటని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇళ్లు ఇవ్వలేక సాకులను చూపి అర్హుల జాబితాను తగ్గిస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు.

దరఖాస్తులను మళ్లీ పరిశీలిస్తున్నాం



ఇందిరమ్మ ఇల్లు కోసం ప్రజా పాలనలో 17 గ్రామాల నుంచి 5,605 దరఖాస్తులు వచ్చాయి. అధికారుల బృందాలను ఏర్పాటు చేసి ఆయా గ్రామాల్లో సర్వే చేయించాం. చాలా వరకు అర్హులను గుర్తించాం, కానీ ఇదివరకే ఇందిరమ్మ లబ్ధిదారులుగా కొన్ని దరఖాస్తులు రిజెక్టు అయ్యాయి. కలెక్టర్ ఆదేశాల మేరకు మళ్లీ సర్వే చేయిస్తున్నాం.

- వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీఓ

నంగునూరులో క్రికెట్ టోర్నీ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

- విజేత జట్టుకు రూ.లక్ష నగదు బహుమతి

నంగునూరు(సిద్దిపేట): మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం సందర్భంగా నంగునూరులో నిర్వహించనున్న క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొని విజేతగా నిలిచే జట్టుకు రూ.లక్ష నగదు బహుమతి అందిస్తామని బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు లింగంగౌడ్, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. నంగునూరులో బుధవారం క్రికెట్ టోర్నీ కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ... అన్ని గ్రామాల నుంచి పోటీలో పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో సమన్వయకర్త భూపేష్, సోమిరెడ్డి, సారయ్య, రమేష్, కృష్టారెడ్డి, పద్మ, ఆనందం, మహేందర్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదాం

నంగునూరు(సిద్దిపేట): స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసిన అన్ని స్థానాల్లో గెలుపొంది సత్తా చాటాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అనగోని లింగంగౌడ్ అన్నారు. బుధవారం జేపీతండా, దర్గపల్లి, బద్దిపడగ గ్రామాల్లో జెండా పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా లింగం గౌడ్ మాట్లాడుతూ.. అమలుకాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో మండల సమన్వయకర్త భూపేష్, శ్రీకాంత్‌రెడ్డి, ఎడ్ల సోమిరెడ్డి, మల్లయ్య, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రవీందర్ రెడ్డి, వెంకటేశం, రాజు, కృష్టారెడ్డి, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు(హుస్నాబాద్): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ జెండా ఎగురవేయాలని పార్టీ దూల్మిట్ట మండల అధ్యక్షుడు మంద యాదగిరి అన్నారు. బుధవారం దూల్మిట్ట మండలంలోని జాలపల్లి, లింగాపూర్ గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అత్యధిక స్థానాలు సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నాచగోని పద్మావెంకట్‌గౌడ్, పార్టీ నాయకులు శ్రీధర్, సిద్దిరాములు, మాజీ ఉపసర్పంచ్ రాగుల సంపత్, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు నాగులపల్లి కుమార్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యాదగిరి

క్లుప్తంగా

ఎల్‌ఓసీ అందజేత

మద్దూరు(హుస్నాబాద్): కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోందని పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపూరి కిరణ్‌కుమార్ అన్నారు. దూల్మిట్ట మండలంలోని బైరాన్‌పల్లికి చెందిన చొప్పరి రాజేశ్వరికి మంజూరైన రూ.2.25 లక్షల ఎల్‌ఓసీ పత్రాన్ని బుధవారం బాధిత కుటుంబానికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడే వారు సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేరు చేయాలి

హుస్నాబాద్‌రూరల్: పట్టణ ప్రజలు తడి, పొడి చెత్తను వేరు చేసి ఇస్తే డంప్‌యార్డులకు తరలించేందుకు వీలుంటుందని కమిషనర్ మల్లికార్జున్ అన్నారు. బుధవారం పట్టణ శివారులోని డంపింగ్‌యార్డులను సందర్శించి పారిశుద్ధ్య కార్మికులకు తడి, పొడి చెత్త వేరు చేసే ప్రక్రియ గురించి వివరించారు. ప్రతీ ఇంటిలో చెత్తను వేరు చేసి ఇవ్వడం వల్ల కార్మికులు ఎక్కువ పని చేయగలుగుతారని తెలిపారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

నంగునూరు(సిద్దిపేట): ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అన్నారు. నాణ్యతా ప్రమాణాలతో విద్యను అందిస్తున్న నంగునూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు చేరాలని సూచించారు. బుధవారం కళాశాల అధ్యాపకులతో కలిసి స్థానిక ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సుశిక్షితులైన అధ్యాపకులచే నాణ్యమైన బోధన అందిస్తున్నామన్నారు. కళాశాలలో ల్యాబ్ సౌకర్యంతో పాటు అన్ని సౌకర్యాలున్నాయని, ఉచిత పాఠ్యపుస్తకాలు సైతం అందిస్తామన్నారు. కార్యక్రమంలో రామస్వామి, బీమ్‌రావు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రైతులను విస్మరిస్తున్న కాంగ్రెస్

మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్



మాట్లాడుతున్న సతీశ్‌కుమార్

కోహెడ(హుస్నాబాద్): కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను విస్మరిస్తోందని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ విమర్శించారు. కోహెడలో బుధవారం జరిగిన మండల బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రైతు భరోసా, రైతు రుణమాఫీ అమలులో కాంగ్రెస్ సర్కారు పూర్తిగా విఫలమైందన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ జెండా ఎగరాలని, ఇందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, శ్రీహరి, సురేశ్, దేవేందర్‌రావు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకులపై చర్యలు తీసుకోండి

నంగునూరు(సిద్దిపేట): ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండగా పార్టీ జెండా ఎగురవేసిన బీఆర్‌ఎస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని టీపీసీసీ సంయుక్త కార్యదర్శి యాదగిరి డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు గ్రామాల్లో నిర్వహిస్తున్న జెండా పండుగపై బుధవారం నంగునూరు ఎంపీడీఓ లక్ష్మణప్పకు కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ కోడ్ అమలు ఉన్న సమయంలో పార్టీ కండువాలతో ర్యాలీలు నిర్వహిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

సంప్రదాయ వంటకాల ప్రదర్శన



వంటకాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం తెలంగాణ సంప్రదాయ వంటకాల ప్రదర్శనను విద్యార్థులు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ భిక్షపతి మాట్లాడుతూ.. ఆహార అలవాట్లు, సంప్రదాయలపై అవగాహన కల్పించడానికి గుడాల పండుగను ఏర్పాటు చేశామన్నారు. శనిగలు, వేరు శనగలు, కందులు, కాయ దినుసులను గుడాల రూపంలో తీసుకోవడం వల్ల బాలికల్లో రక్తహీనత సమస్యలు రావన్నారు. కార్యక్రమంలో లెక్చరర్లు నయనాదేవి, కుమారస్వామి, బాలరాజు, చంద్రమౌళి, అనిల్, సుధామాధురి పాల్గొన్నారు.

బెల్టు షాపులు నియంత్రించండి



ఎస్‌ఐకి వినతిపత్రం అందజేస్తున్న అశోక్‌గౌడ్

గజ్వేల్‌రూరల్: గ్రామాల్లో బెల్టుషాపులను నియంత్రించేలా చర్యలు తీసుకోవాలని గజ్వేల్ మండల బీజేపీ అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయంలో బుధవారం ఎక్సైజ్ ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో ఆరు మోసాలు.. 66 అబద్ధాల్లో ఒక్కటైన బెల్టుషాపుల నియంత్రణ అని చెప్పి దానిని విస్మరించిందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బెల్టు షాపులను నియంత్రిస్తామని, ప్రజల ప్రాణాలే ముఖ్యమని, బీఆర్‌ఎస్ మాదిరిగా ఆదాయం ముఖ్యం కాదని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఊదరగొట్టారని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజు, స్వామి, కుమార్, నర్సింహారెడ్డి, అనిల్, ప్రసాద్, మహేష్, గణపతి, ఆనంద్ పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నను సస్పెండ్ చేయాలి

రెడ్డి ఐక్యవేదిక నేతల డిమాండ్



రూరల్ ఎస్‌ఐ అపూర్వరెడ్డికి ఫిర్యాదు చేస్తున్న రెడ్డి సంఘం నాయకులు

సిద్దిపేటరూరల్: రెడ్డిలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ కులాల మధ్య చిచ్చుపెడుతున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలని, పదవి నుంచి సస్పెండ్ చేయాలని రెడ్డి ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం రెడ్డి ఐక్యవేదికతో పాటుగా, బుస్సాపూర్ మాజీ సర్పంచ్ సదాశివారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రెడ్డి ఓట్లతో ఎమ్మెల్సీగా పదవి పొందిన తీన్మార్ మల్లన్న తప్పుడు మాటలు మాట్లాడటం సరైంది కాదన్నారు. వెంటనే రెడ్డీలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రెడ్డిఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బాపురెడ్డి, ఉపాధ్యక్షులు రాజిరెడ్డి, గౌరవ అధ్యక్షులు మల్లారెడ్డి, మండల అధ్యక్షులు మహేందర్‌రెడ్డి, నాయకులు బుచ్చిరెడ్డి, సదాశివారెడ్డి, అంజిరెడ్డి, దేవేందర్‌రెడ్డి అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ఎస్‌ఐ శ్రీరామ్ ప్రేమ్ దీప్

దౌల్తాబాద్ (దబ్బాక): విద్యార్థులు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ శ్రీరామ్ ప్రేమ్ దీప్ అన్నారు. బుధవారం దౌల్తాబాద్ గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల స్కూల్‌లో విద్యార్థులకు సైబర్ అవేర్‌నెస్, ఈవ్‌టీసింగ్, చైల్డ్ మ్యారేజేస్ గురించి అవగాహన నిర్వహించారు. సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శారద, అధ్యాపకురాలు, హెడ్ కానిస్టేబుల్ విక్రమ్ పాల్గొన్నారు.

గంజాయి, మత్తు పదార్థాలపై నిఘా

ఎస్‌ఐ విజయ్‌భాస్కర్

అక్కన్నపేట(హుస్నాబాద్): యువత గంజాయి మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్‌ఐ విజయ్ భాస్కర్ అన్నారు. అక్కన్నపేట మండలం కట్కూర్ గ్రామంలో రాత్రి నార్కోటిక్ డాగ్స్‌తో పలు కిరాణం ఇతర దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పలు అనుమానాస్పద ప్రదేశాలలో నార్కోటిక్ డాగ్స్ తనిఖీ చేశామన్నారు. గంజాయి, మత్తు పదార్థాలు అమ్మినా, రవాణా చేసినా నేరమేనన్నారు. గంజాయి ఎవరైనా అమ్మితే వెంటనే తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో టోల్ ఫ్రీ నెంబర్ 1908కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. నిషేధిత మత్తు పదార్థాల రవాణా చేసేవారిపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశామన్నారు.

అభ్యంతరాలుంటే తెలపండి

ఎంపీడీఓ మురళీధర్‌శర్మ

సిద్దిపేటరూరల్: గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ప్రదర్శించిన ఓటరు జాబితాపై ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని ఎంపీడీఓ మురళీధర్‌శర్మ రాజకీయ పార్టీల నేతలను కోరారు. బుధవారం రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో ఓటరు జాబితాపై పలు రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మురళీధర్‌శర్మ మాట్లాడుతూ.. ఓటరు జాబితాలో ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావడం వల్ల వాటిని సవరిస్తామన్నారు. ఈ సమావేశంలో ఎంపీఓ విష్ణు, రాజకీయ పార్టీల నాయకులు ఎర్రయాదయ్య, రాములు, కనకయ్య, సురేశ్, ఉమేశ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ మురళీధర్ శర్మ

పాఠశాలకు 60 కుర్చీలు అందజేత



కుర్చీలు, బకెట్లు, బెడ్స్ అందజేసిన యూనియన్ బ్యాంక్ అధికారులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలకు కుర్చీలు అందజేశారు. బుధవారం యూనియన్ బ్యాంక్ డిప్యూటీ రీజనల్ అధికారి రాఘురా, బ్యాంక్ చీఫ్ మేనేజర్ మాక్రానంద్, డైరెక్టర్ రాజలింగం ఆధ్వర్యంలో 60కుర్చీలు, 15 బకెట్లు బెడ్స్ అందజేసి ఉదారత చాటారు. వారు మాట్లాడుతూ విద్యార్థులందరూ బాగా చదవుకొని, మంచి ఉన్నతస్థానాల్లో నిలవాలన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యాను అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి గుగులోతు రంగానాయక్, ఎస్‌ఐ విజయ్‌భాస్కర్, పాఠశాల ప్రత్యేకాధికారి సరిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో సైబర్ నేరాలకు బ్రేక్

గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

వర్గల్(గజ్వేల్): ఫోన్‌కు వచ్చే మెసేజ్‌ల లింక్స్‌ను ఓపెన్ చేయకుండా అప్రమత్తంగా ఉంటే సైబర్ నేరాలకు బ్రేక్ పడుతుందని వర్గల్ మండలం గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం సైబర్ జాగ్‌రూక్త దివస్ పురస్కరించుకుని మైలారం హైస్కూల్ విద్యార్థులకు బిట్ కాయిన్ ఫ్రాడ్, డిజిటల్ అరెస్ట్ తదితర సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఫ్రీగా డబ్బులొస్తాయని ఆశపడి డబ్బులు పోగొట్టుకోవద్దని సూచించారు. బ్యాంకు అకౌంట్ వివరాలు, ఓటీపీ నంబర్, ఏటీఎం కార్డు, క్రెడిట్ కార్డు నంబర్ ఎవరికీ చెప్పొద్దని వివరించారు. సైబర్‌నేరాల బారిన పడితే 24 గంటల్లోగా 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయాలని పేర్కొన్నారు.

నూతన ఎంపీడీఓకు సన్మానం



రాంప్రసాద్‌ను శాలువాతో సన్మానించిన మండల సాధన సమితి నాయకులు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండల అభివృద్ధి అధికారి రాంప్రసాద్ పదవీ బాధ్యతలు చేపట్టారు. బుధవారం మండల సాధన సమితి నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పొల్కంపల్లి నరేందర్, మల్లం ఐలయ్య, బాలాగౌడ్ అభివృద్ధిలో కుకునూరుపల్లి మండలం ముందంజలో నిలిచేలా పాలన సాగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు అమరేందర్, హరికిషన్, నర్సాగౌడ్, అజీమొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ చేస్తే ఉద్యమిస్తాం

మిరుదొడ్డి(దుబ్బాక): ఎస్సీ వర్గీకరణ చేస్తే దేశవ్యాప్తంగా ఆందోళన చేపడతామని జాతీయ మాల మహానాడు రాష్ట్ర పొలిట్‌బ్యూరో చైర్మన్ ర్యాకం శ్రీరాములు అన్నారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఆమోదం తెలుపుతూ తీర్మాన లేఖను పంపడాన్ని వ్యతిరేకిస్తూ అక్బర్‌పేట- భూంపల్లి మండల కేంద్రంలో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జాతీయ మాల మహానాడు సిద్దిపేట జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మండల యాదగిరి, నాయకులు సుమన్, బుచ్చయ్య, కుమార స్వామి, రామస్వామి, స్వామి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు. అలాగే మిరుదొడ్డి మండల కేంద్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు.

చిన్నకోడూరు(సిద్దిపేట): ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం తెలిపినందుకు నిరసనగా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో బుధవారం చిన్నకోడూరులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి మండల అధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ.. వర్గీకరణ బిల్లు ఆపే వరకు పోరాటాలు చేపడుతామన్నారు.



మిరుదొడ్డి(దుబ్బాక): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మాల మహానాడు నాయకులు



చిన్నకోడూరు(సిద్దిపేట): దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

వర్గీకరణ బిల్లుతో మాలలకు అన్యాయం

సిద్దిపేటకమాన్: ఎస్సీ వర్గీకరణ బిల్లు మాలలకు అన్యాయంగా జరిగిందని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు అన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ఆమోదించడాన్ని వ్యతిరేకిస్తూ వ్యతిరేక పోరాట సమితి నాయకులు సిద్దిపేటలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. వారు మాట్లాడుతూ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల ఉపకులాలు పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఆర్యవైశ్య మండలాధ్యక్షుడిగా శ్రీనివాస్‌రావు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండల ఆర్యవైశ్య మహాసభ మండలాధ్యక్షుడిగా గుబ్బ శ్రీనివాస్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు జిల్లా సంఘం బాధ్యులు చంద్రశేఖర్, సత్యం, వెంకటయ్య, హరినాథ్ ఆధ్వర్యంలో బుధవారం మండల కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడిగా అమర రాము, కోశాధికారిగా బాల్‌రాజు, పట్టణ అధ్యక్షుడిగా వెంకటేశం, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వల్లాల వెంకటేశ్‌లతో పాటు కార్యవర్గ సభ్యులను కూడా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, కిరణ్, రాము పాల్గొన్నారు.

◆ మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

మద్దూరు(హుస్నాబాద్): దేశంలోని అన్ని వర్గ,కుల, మతాలకు సమన్యాయం చేసేలా కేంద్ర బడ్జెట్ ఉందని దూల్మిట్ట మండల బీజేపీ అధ్యక్షుడు కొడం యాదగిరి పేర్కొన్నారు. కేంద్ర బడ్జెట్‌పై హర్షం వ్యక్తం చేస్తూ ప్రధాని మోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు బుధవారం మండల కేంద్రంలో పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బానోత్ లక్ష్మణ్‌నాయక్, మండల ఉపాధ్యక్షుడు కనకరాజు, భూపతి తదితరులు పాల్గొన్నారు.

◆ సాగు నీరు విడుదల చేయాలి

దుబ్బాక: పట్టణంలోని పెద్దచెరువులోకి మల్లన్నసాగర్ నీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం రైతులు ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మల్లన్నసాగర్ ప్రధాన కాలువ నుంచి 300 మీటర్ల కాలువ తీసి పెద్దచెరువులోకి కట్టు కాలువ ద్వార నీరు వదలాలని కోరారు. పంటలు ఎండిపోతున్నా రైతులు పట్టించుకోవడం లేదన్నారు.

◆ కొమురయ్యకే మా మద్దతు టీపీటీయూ రాష్ట్ర నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయనున్న బీజేపీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమరయ్యకే తమ మద్దతు ఉంటుందని టీపీటీయూ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రాధాకృష్ణారావు, చంద్రశేఖర్ అన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కావాలంటే చట్ట సభల్లో మల్క కొమరయ్య లాంటి సరైన వ్యక్తి ఉండాలన్నారు. పీఆర్సీతో పాటు పెండింగ్ డీఏలు, సీపీఎస్ రద్దు వంటి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిద్దిపేట జిల్లా అధ్యక్షులు బైరి వెంకటేశం, ప్రధాన కార్యదర్శి సుద్దాల భిక్షపతి, వెంకట్, సురేష్, పాల్గొన్నారు.

◆ విద్యావ్యవస్థకు ప్రాథమిక స్థాయి పునాది

కొండపాక(గజ్వేల్): విద్యా వ్యవస్థకు ప్రాథమిక స్థాయి పునాదిలాంటిదని మండల విద్యాధికారి(ఎంఈఓ) బచ్చలి సత్తయ్య అన్నారు. కుకునూరుపల్లి మండలం లకుడారంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను బుధవారం సందర్శించారు. విద్యాబోధనల తీరు, టెన్త్ ప్రత్యేక తరగతులపై అడిగి తెలుసుకున్నారు. సత్తయ్య మాట్లాడుతూ విద్యావ్యవస్థలో ప్రాథమిక స్థాయి పటిష్టంగా ఉంటే విద్యార్థులు ఉన్నతులుగా రాణిస్తారన్నారు.

◆ పెండింగ్ బిల్లులు చెల్లించాల్సిందే

అక్కన్నపేట(హుస్నాబాద్): మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులు చెల్లించాల్సిందేనని ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి, కపూర్‌నాయక్‌తండా మాజీ సర్పంచ్ భానోతు సంతోష్‌నాయక్ అన్నారు. ఛలో ఆసెంబ్లీ ముట్టడికి వెళ్లనీయకుండా పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు రాకముందే బిల్లులు చెల్లించాలన్నారు. అరెస్టయినవారిలో బొమ్మగాని రాజేశం, అన్నాడి దినేష్‌రెడ్డి, జిల్లెల అశోక్‌రెడ్డి, కరివేద నరేందర్‌రెడ్డి, కుమారస్వామి, మార్క తిరుపతి, కుమార్, లింగాల ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ..



ఉపాధ్యాయులతో విద్యార్థులు

దుబ్బాకటౌన్: రాయపోల్ మండలం వడ్డేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయుల పాత్ర పోషించారు. డీఈవోగా అజయ్ కుమార్, ప్రధానోపాధ్యాయురాలుగా సాత్విక, ఎంఈవోగా అరుణ్ మిగతా విద్యార్థులు సబ్జెక్టుల వారీగా వారి పాత్ర నిర్వహించారు. విద్యార్థులు జీవితంలో ఒక లక్ష్యాన్ని ఎంచుకొని లక్ష్యం దిశగా సాగాలని ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ రెడ్డి కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రజిని, సుధాకర్, వరప్రసాద్, మోహన్, అనిల్ కుమార్, ఇంద్రసేనారెడ్డి, కరుణాకర్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.